క్లుప్తంగా

శ్రీనివాసుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుడి కల్యాణం బుధవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు చక్రపాణి నర్సింహమూర్తి, అర్చకులు కోటపల్లి అనీశ్ బృందం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిపించారు. గురువారం విష్ణుయాగం, బలిహరణం, సదస్యము వేదగోష్ఠి, బేరిపూజ, దోపుకథ కాలక్షేపం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తెగుళ్లతో అప్రమత్తంగా ఉండండి

దస్తురాబాద్: వరి పంటలకు సుడిదోమ, పాము పొడు తెగులు సోకే అవకాశం ఉందని.. రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ విస్తరణాధికారి కిరణ్ అన్నారు. గురువారం మండలంలోని మల్లాపూర్‌లో వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ

నర్సాపూర్(జి):మండల కేంద్రంలోని 686 సర్వేనంబర్‌లో ఏడు గుంటల భూమి తనదే అంటూ మండల కేంద్రానికి చెందిన ఎం.సత్తెమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ విషయమై గురువారం డీఎల్‌పీవో రమేష్ పంచాయతీకి వచ్చి విచారణ చేపట్టారు. ధ్రువపత్రాలు సమర్పించకపోవడం, సత్తెమ్మ గైర్హాజరవడంతో డీఎల్‌పీవో వెనుదిరిగారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

పెంబి: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం లబ్ధిదారులు తప్పనిసరిగా తమ బ్యాంకుఖాతాను ఆధార్‌కు అనుసంధానం చేయించుకోవాలని ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. గురువారం పెంబి తపాలా కార్యాలయంలో బీపీఎం రాజన్నతో కలిసి ఏఈవో రైతులకు ఇండియా పోస్ట్ పేమెంట్ ఖాతాలపై అవగాహన కల్పించారు. మండల పరిధిలో 106మంది రైతులు రెగ్యులర్ బ్యాంకు ఖాతాల్లేక కిసాన్ నిధి సాయం పొందలేదని పేర్కొన్నారు. రైతులు పోస్టాఫీసులో పీఎం కిసాన్ ఐపీపీబీ ఖాతాలు తీసుకుంటే కిసాన్ నిధి సాయం పొందచ్చని తెలిపారు. శనివారం లోగా రైతులు ఈకేవైసీ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి



వేడుకల్లో బ్యాంకు సిబ్బంది

నిర్మల్‌టౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ డీవీఎస్ రామారావు అన్నారు. దేశంలోని 43 గ్రామీణ బ్యాంకుల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి టీజీబీ అన్ని విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో గురువారం జిల్లా కేంద్రంలోని రీజినల్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శివకుమార్, అభినయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరిన విద్యుత్ ఇబ్బందులు



విద్యుత్ లైన్ ప్రారంభిస్తున్న అధికారులు

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద నూతన విద్యుత్ లైన్, డీటీఆర్‌ను గురువారం సర్పంచ్ నిమ్మతోట రాజమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా బతుకమ్మ ఉత్సవాలకు వెలుతురు సరిగా లేకపోవటంతో మహిళలు ఇబ్బందులు పడేవారన్నారు. ఈసారి అధికారులు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తొలగిపోయాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శివయ్య, శ్రీనివాస్, పలువురు సిబ్బంది చరణ్‌దాస్, ప్రేమ్, నజీర్, బద్రి తదితరులు ఉన్నారు.

ఎల్‌ఐసీ చెక్కు అందజేత

కుభీర్: మండలంలోని సాంవ్లి గ్రామానికి చెందిన ఎ.నర్సయ్య ఎల్‌ఐసీ(లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో పాలసీ తీసుకొని ఇటీవల ఆయన గుండెపోటుతో చనిపోయారు. నామినీ అయిన నర్సయ్య భార్యకు గురువారం పలువురు ఎల్‌ఐసీ అధికారులు రూ.6,60,000 విలువైన చెక్కును అందజేశారు. ఎల్‌ఐసీ బీఎం శ్రీనివాస్, డీవో శ్రావణ్‌కుమార్, ఏజెంట్ శ్వేత తదితరులు ఉన్నారు.

రైల్వే ప్రయాణికులకు అవస్థలు

- బాసర రైల్వేస్టేషన్‌కు అరగంట ఆలస్యంగా చేరుకున్న భైంసా డిపో బస్సు
- అప్పటికే వెళ్లిపోయిన అజంతా ఎక్స్‌ప్రెస్
- సకాలంలో హైదరాబాద్ వెళ్లలేక ఇబ్బందులు పడిన ప్రజలు



బాసర రైల్వేస్టేషన్‌లో భైంసా డిపో బస్సు



రైలు వెళ్లిపోవడంతో నిరాశలో ప్రయాణికులు

భైంసా: భైంసా డిపోకు చెందిన ఏపీ01జెడ్0016 అనే నంబర్ కల్గిన ఆర్టీసీ బస్సు బాసర రైల్వేస్టేషన్‌కు ఆలస్యంగా రావడంతో అందులో ఉన్న ప్రయాణికులు హైదరాబాద్ వెళ్లే అజంతా ఎక్స్‌ప్రెస్ మిస్సయిన ఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఈ బస్సును నమ్ముకొని టికెట్ రిజర్వేషన్ చేసుకున్నవారు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరోరైలు వచ్చే వరకు వారంతా నిరీక్షించారు.

రైలు ఆలస్యమైనా..

భైంసా నుంచి ప్రతిరోజు ప్రయాణికులను తీసుకొచ్చే బస్సు తెల్లవారుజామున 4:40 గంటలకు బాసర రైల్వేస్టేషన్‌లో ఉండాలి. కానీ గురువారం ఈ బస్సు బాసరకు ఉదయం 5:13 గంటలకు ప్రయాణికులను చేర్చింది. సుమారు 33 నిమిషాలు బస్సు ఆలస్యంగా వచ్చింది. తెల్లవారుజామున 4:48గంటలకే బాసర వచ్చే అజంతా ఎక్స్‌ప్రెస్ గురువారం మాత్రం 12 నిమిషాలు ఆలస్యంగా వచ్చి ఐదు గంటలకు వెళ్లిపోయింది. అయినప్పటికీ బస్సు రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులను చేర్చలేదు.

వారానికోసారి ఇదే తీరు...

మన్మాడ్ జంక్షన్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే అజంతా ఎక్స్‌ప్రెస్ తెల్లవారుజామున ఉదయం 4.48గంటలకు బాసర స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు ఉదయం తొమ్మిది గంటల్లోపే సికింద్రాబాద్‌కు చేరుస్తుంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొన్ని నెలల కిందట అజంతా ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లే వారి కోసం భైంసా డిపో నుంచి బస్సును ప్రారంభించారు. ఈ బస్సు కోసం భైంసా, దేగాం, తరోడ, ముధోల్, టాక్లి, బిద్రెల్లి గ్రామాల ప్రజలు రోజు వేచిచూస్తుంటారు. ప్రతి నెలలో మూడు, నాలుగు సార్లు రైలు వెళ్లిపోయాక బస్సు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని పలువురు వాపోతున్నారు. రైలు అందకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు, హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్లే రోగులు, వ్యాపారులు, ఇతరులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు స్పందించి సకాలంలో బస్సు నడిచేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరిక

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సబ్బండ వర్గాలకు అందుతున్న సంక్షేమ ఫలాలను చూసే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో లోకల్‌వెల్మల్‌కు చెందిన 150 మంది బీజేపీ కార్యకర్తలు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యం, కొప్పెల ముత్యంరెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరగా.. వారికి మంత్రి కండువాలు కప్పి ఆహ్వానించారు. అప్పాల గణేశ్ తదితరులు ఉన్నారు.

సారంగాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అల్లోల మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాణిక్‌రెడ్డి, మాధవరావు, రవీందర్‌రెడ్డి, రాజ్‌మహ్మద్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

‘బీజేపీతోనే అన్నివర్గాలకు మేలు



పార్టీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం పలువురు బీజేపీలో చేరారు. నర్సాపూర్(జి) మండలం టెంబుర్ని గ్రామస్తులు పలువురు, మామడ మండలం కమల్‌కోట్‌కు చెందిన గంగపుత్ర, యాదవ, దళిత సంఘాల నాయకులు, నల్దుర్తికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, నిర్మల్ పట్టణంలోని గొల్లపేట్ బీసీ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరగా.. వారికి మహేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తక్కల రమణారెడ్డి, ఏలేటి శ్రీకాంత్‌రెడ్డి బాపురెడ్డి, పడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మామడ: బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. గురువారం మామడలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.అంజుకుమార్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, భూపతిరెడ్డి, లింగారెడ్డి, లింగంయాదవ్,లింగారెడ్డి, చక్రపాణి, రాజారెడ్డి, నవీన్, నరేశ్ పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. ముధోల్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సూర్యాపూర్, మెదన్‌పూర్ తండాలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఓలాలో బైక్ ర్యాలీ నిర్వహించి పార్టీ కార్యాలయం ప్రారంభించారు. సూర్యాపూర్ మాజీ ఎంపీటీసీ పెద్దింటి పోశెట్టి, రమేశ్, సురేశ్, సుధాకర్ బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సర్పంచ్‌లు బక్కి సునీత, కనీస్ ఫాతిమా, హైమద్, మల్లేశ్, దాసరి కిషన్, శంకర్ గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, అశోక్‌రెడ్డి, దశరథ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

కుంటాల: రైతుబంధు డబ్బులు జమ చేయవద్దని కాంగ్రెస్ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని గురువారం మండలంలోని సూర్యాపూర్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన రైతుబంధు దేశానికే ఆదర్శమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

విఠల్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

తానూరు: మరోసారి ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ కార్యకర్తలు గురువారం మండలంలోని ఖర్బలా గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతారెడ్డి, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, భీమ్‌పవార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: విఠల్‌రెడ్డిని హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యులు సూర్యకాంత్‌రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం మండలంలోని మాంజ్రి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాసర మండలంలో..

భైంసా: రైతు ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని సర్పంచుల సంఘం బాసర మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి కోరారు. గురువారం బాసర మండలంలోని ఓని, కౌట, కిర్గుల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు పెట్టుబడి సాయం నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి లేఖ రాయడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోర్వ శ్యామ్, సర్పంచ్ లక్ష్మణ్‌రావు, జ్ఞానిపటేల్ తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్వరం: వట్టోలిలో ప్రచారం చేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్, నాయకులు

లోకేశ్వరం: ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి మళ్లీ బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ ఓటర్లను కోరారు. గురువారం మండలంలోని వట్టోలి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రత్నాకర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, బండి ప్రశాంత్, రాజేశ్వర్, దిగంబర్, భోజన్న, భోజారెడ్డి, భీంరావు, కపిల్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో పలు పార్టీలకు చెందిన సుమారు 50 మంది గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు షౌకత్ పాషా, మీర్జా బేగ్, కొడారి రవీందర్, బిక్కునాయక్, కొడారి నరేశ్, కొడారి వెంకట్రాములు, కాన్షీరాం, నరేశ్, రమేశ్, నర్సయ్య, పెద్దన్న తదితరులున్నారు.

సారంగాపూర్: మండలకేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కుమార్తె మాధురి గురువారం గడప గడపకూ కాంగ్రెస్ పేరిట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బొల్లోజి నర్సయ్య, మారుతి, హాదీ, తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో నాయకులు

సాయిబాబా ఆలయంలో పూజలు



అన్నదాతలను సన్మానిస్తున్న జగన్మోహన్ రెడ్డి



కుంటాల: కల్లూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలిరాగా వారికి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అన్నదాతలుగా నిలిచిన మామిడి సామిక-నిఖిల్‌రెడ్డి, సాహితీ-ప్రవీణ్‌రెడ్డి, వనిత-మోహన్, లావణ్య-వినోద్ దంపతులను ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ లక్కడి జగన్మోహన్ రెడ్డి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాయిదీక్ష సేవా సమితి సభ్యులు జైపాల్ రెడ్డి, ఉప్పులనందు, జిందం గోవర్ధన్, సోమేశ్, భూషణ్, చౌదరి, శ్రీధర్ పాల్గొన్నారు.

కుంటాల: రెండో షిరిడీగా ప్రసిద్ధి గాంచిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. మధ్యాహ్న హారతి కార్యక్రమంలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు సరికాదు

కడెం: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు జరిగాయని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు, దళితబంధు పథకాలను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి లేఖ రాయడాన్ని తప్పుపట్టారు. జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, తిరుపతిరెడ్డి, భీమేశ్, హసీబ్ తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిసాయం నిలిపివేసేలా చూడాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సరికాదని ఎంపీపీ సింగరి కిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్‌రావ్, శివయ్య, శ్రీనివాస్, రాజనర్సయ్య, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కడెంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపూర్: రైతులకు పెట్టుబడి సాయం, దళితబంధు వంటి పథకాలను నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజగంగన్న, మోహిద్, వెంకాగౌడ్, గజేందర్, వాల్‌సింగ్, నర్సయ్య, సురేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

పెంబి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతులకు కష్టాలు తప్పవని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. పెట్టుబడి సాయం నిలిపివేయాలని కాంగ్రెస్ నేతలు ఈసీకి లేఖ రాయడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మాణిక్‌రావు ఠాక్రే దిష్టిబొమ్మను దహనం చేశారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీటీసీ రామారావ్, సర్పంచ్‌లు పూర్ణచందర్‌గౌడ్, సుధాకర్, మహేందర్, తానాజీ నాయకులు ఉన్నారు.

దిలావర్‌పూర్: పెట్టుబడిసాయం నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు ఈసీకి ఫిర్యాదు చేయం సరికాదని.. వచ్చే ఎన్నికల్లో రైతులు ఆ పార్టీకి గుణపాఠం చెబుతారని బీఆర్‌ఎస్ నాయకులు కోడె రాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ అనిల్, రవి, నవీన్, రవి, షేక్ సలీం, సుధీర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నీరు అందించని ‘ఎత్తిపోతల’

- ప్రశ్నార్థకంగా యాసంగి పంటల సాగు
- డొంగుర్గాంలో వర్షాలకు దెబ్బతిన్న మోటార్లు, ప్యానెల్‌బోర్డు
- ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా నర్సాపూర్(జి) ఎత్తిపోతల పథకం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



వర్షాలకు దెబ్బతిన్న మోటార్లు



డొంగుర్గాం ఎత్తిపోతల పథకం

నర్సాపూర్(జి): పల్లపు ప్రాంతంలోని సాగునీటిని.. మెట్ట పొలాలకు మళ్లించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పలుచోట్ల ఎత్తిపోతల పథకం నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. వీటితో పంటలకు సాగునీరు అంది రైతులకు మేలు జరుగుతుంది.

డొంగుర్గాం ఎత్తిపోతల పథకం..

మండలంలోని డొంగుర్గాం ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధి 530 ఎకరాలు. రూ.3.25 కోట్లతో 60 హెచ్‌పీ మూడు మోటార్లు, ప్యానెల్ బోర్డు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. చాక్‌పల్లి, డొంగుర్గాం, అర్లి(కే) గ్రామాల్లోని రైతుల పంటలకు ఈ పథకం సాగునీరు అందిస్తోంది. దీనిని నమ్ముకొని రైతులు యాసంగిలో వరి, మొక్క జొన్న, నువ్వు పంటలు సాగు చేస్తారు.

ఇటీవల వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మోటార్లు, ప్యానెల్‌బోర్డు నీట మునిగి దెబ్బతిన్నాయి. దీంతో వచ్చే యాసంగి పంటలకు సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గడ్డెన్న ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డొంగుర్గాం ఎత్తిపోతల పథకం నీట మునిగింది. గడ్డెన్న ప్రాజెక్టు గేట్లు తెరవడం, సిరాల శ్రీరామస్వామి ప్రాజెక్టు తెగిపోవడంతో వరద పోటెత్తడంతో ఈ ఎత్తిపోతల పథకం మోటార్లు దెబ్బతిన్నాయి.

నిరుపయోగంగా నర్సాపూర్(జి) పథకం..

2011లో ప్రారంభించిన నర్సాపూర్(జి) ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధి 1750 ఎకరాలు. రూ.12 కోట్లతో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం ప్రారంభంలో కొన్నేళ్లు పనిచేసినా.. తర్వాత నిరుపయోగంగా మారింది. మోటార్లు పనిచేయకపోవడం, కాలువలు పూడుకపోవడంతో ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా మారింది.

నిర్వహణ బాధ్యత మరిచిన అధికారులు..

నర్సాపూర్(జి) ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు రూ.2.20కోట్లు అవసరమని అధికారులు గుర్తించారు. కానీ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో వదిలేశారు. ఎత్తిపోతల కమిటీ సభ్యులు దీనిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. యాసంగి పంటలకు నీరు అందించే డొంగుర్గాం ఎత్తిపోతల పథకానికి అధికారులు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి. –దేవన్న, డొంగుర్గాం

నీరందేలా చూడాలి



నాకు ఎకరంన్నర భూమి ఉంది. గతేడాది యాసంగిలో నీరందక పంటలు చివరి దశలో ఎండిపోయాయి. అలాంటి పరిస్థితి రాకుండా అధికారులు మరమ్మతులు చేపట్టి నీరందేలా చూడాలి. –రమేశ్, డొంగుర్గాం

టెండరుకు స్పందన కరువు

డొంగుర్గాం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు సంబంధించి రెండు సార్లు టెండర్లు వేశాం. పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మూడోసారి టెండరు వేసేలోగా ఎన్నికల కోడ్ వచ్చేసింది. వాటి మరమ్మతులకు రూ.14 లక్షలు మంజూరయ్యాయి. –వెంకటేశ్వర్లు, ఏఈ, నీటిపారుదల శాఖ

మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణంరాజు

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వర్తించే 37 మంది కార్మికులు, సిబ్బందికి పట్టణానికే చెందిన ఒడ్డెపల్లి కృష్ణంరాజు దుస్తులు పంపిణీ చేశారు. రూ.40వేల విలువైన రెడీమేడ్ దుస్తులు అందించి ఉదారత చాటారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని కృష్ణంరాజు పేర్కొన్నారు. ఓకేఆర్ మిత్ర బృందం తదితరులున్నారు.